క్లుప్తంగా

రాంచందర్‌కు సన్మానం



పాన్‌గల్: ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్, విజిలెన్స్ కమిటీ సభ్యుడిగా నియమితులైన మండల వాసి బోరెల్లి రాంచందర్‌ను గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, వెంకటేష్‌నాయుడు, రాముయాదవ్, పుల్లారావు, భాస్కర్‌యాదవ్, జయరాములుసాగర్, గిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చిన్నంబావి: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన ఘటన మండలంలో పెద్దదగడ గ్రామంలో చోటు చేసుకుంది. మండలంలోని పెద్దదగడ గ్రామానికి చెందిన రైతు భానుప్రకాష్‌గౌడ్ చెందిన ఆవు తన పంట పొలంలో మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది.

డ్రెయినేజీ పనులు ప్రారంభం



వీపనగండ్ల: మండలంలోని కల్వరాల గ్రామంలో 11వ వార్డులో గురువారం డ్రెయినేజీ నిర్మాణ పనులను నాగర్‌కర్నూల్ జిల్లా పర్యాటక శాఖ అధికారి నర్సింహ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ప్రారంభించారు. వార్డులో డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించి మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకువెళ్లగా డీఎంఎఫ్‌టీ నిధుల నుంచి రూ.4 లక్షలు మంజూరు చేశారన్నారు.

నిబంధనల మేరకు ఇళ్ల నిర్మాణం చేపట్టాలి



వనపర్తి రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిబంధనలు పాటించి నిర్మాణం చేపట్టాలని ఎంపీడీఓ రాఘవ సూచించారు. గురువారం మండలంలోని చిట్యాలలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పంచాయతీ కార్యదర్శి పూర్ణచంద్రతో కలిసి పరిశీలించారు. మిగతా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. కేంద్రానికి పిల్లలు సక్రమంగా హాజరయ్యే విధంగా చూడాలని టీచర్‌కు సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు



వనపర్తి రూరల్: మండలంలోని చందాపురంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుదాఘాతంతో గొర్రె మృతి చెందింది. గ్రామస్తుల ద్వారా విషయం తెలుసుకున్న విద్యుత్ అధికారులు గురువారం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేసి షార్ట్‌సర్క్యూట్ సమస్యను పరిష్కరించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎలాంటి ప్రమాదం లేదని జేఎల్‌ఎం శేఖర్ తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

కేటీదొడ్డి: ఇంటింటికీ కేంద్ర పథకాలను వివరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి అన్నారు. మండలంలోని ఇర్కిచేడు గ్రామంలో గురువారం బీజేపీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరెడ్డి మాట్లాడుతూ.. నరేంద్రమోదీ 11 ఏళ్ల పాలనలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని వివరించారు. రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి, ఆహారభద్రత మిషన్, ఉచిత బియ్యం పంపిణీ, రక్షణరంగంలోని పౌరుల భద్రత, సీసీరోడ్లు, వీధిదీపాలు, శ్మశాన వాటికలు, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా దేశ సైనిక శక్తి గురించి ప్రపంచానికి చాటి చెప్పారని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు సూర్యకాంత్‌రెడ్డి, రంగారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, నర్సిరెడ్డి, మునెప్ప ఉన్నారు.

సర్కార్ బడుల్లోనే నాణ్యమైన విద్య



పాన్‌గల్ బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా చేరిన బాలికలతో ఎంఈఓ, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన అందుతుందని ఎంఈఓ శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం విజయలక్ష్మి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నూతనంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు ఘన స్వాగతం పలికి ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఏడాది బాలికల ఉన్నత పాఠశాలలో 27 మంది విద్యార్థులు కొత్తగా చేరినట్లు తెలిపారు.

నోటు పుస్తకాల పంపిణీ

మండలంలోని దొండాయిపల్లి ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి ఆర్థిక తోడ్పాటుతో రూ.4,200 విలువైన నోటు పుస్తకాలను విద్యార్థులకు గురువారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ పేర్కొన్నారు. పాఠశాలలకు దాతలు అందిస్తున్న ఆర్థిక తోడ్పాటు మరువలేదన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు సాయంత్రం 5:30 గంటల వరకు పాఠశాలకు నిర్వహిస్తూ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం శ్రీనివాస్‌గౌడ్, వెంకటేష్, వలంటీర్ లక్ష్మి, మాజీ సర్పంచ్ సుధాకర్‌రెడ్డి, శాంతయ్య, వెంకట్రామ్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచాలి

వీపనగండ్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ప్రయత్నించాలని మండల విద్యాధికారి నర్సింహులు సూచించారు. గురువారం సంగినేనిపల్లి ప్రాథమిక పాఠశాలను సందర్శించిన ఆయన విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, దుస్తులను సకాలంలో అందజేయాన్నారు. తూంకుంట ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, మధుసూదన్‌రెడ్డి, కృష్ణయ్య, కిరణ్, సీఆర్పీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వెనుబడ్డ విద్యార్థులపై శ్రద్ధ

చదువులో వెనుబడ్డ విద్యార్థులు విద్యలో రాణించే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు భానుప్రకాష్ అన్నారు. గురువారం పుర్గర్చర్ల యూపీఎస్, రంగవరం, గోపల్‌దిన్నె ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, బాలగౌడ్, ఉపాధ్యాయులు లోకయ్య, సురేష్, అలివేలమ్మ, మగ్బూల్, సుష్మిత, సీఆర్పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



తూంకుంట ఉన్నత పాఠశాలలో..



పుర్గర్‌చర్లలో..

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

వనపర్తిటౌన్: 100 రోజుల కార్యచరణలో భాగంగా మున్సిపాలిటీలోని అన్ని వార్డులకు తిరుగుతూ ఇంటింటి తడి, పొడి చెత్త విభజనపై అవగాహన కల్పిస్తున్నామని కమిషనర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 5, 17, 7, 14, 27, 31, 13, 18, 8, 30, 23వ వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా తదితర రోగాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ శివకుమార్ జిల్లా కేంద్రంలోని పలు షాపుల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ మేరకు పలు షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వాడుతున్నట్లు గుర్తించి యజమానులకు మొత్తం రూ. 5వేల జరిమానా విధించినట్లు శివకుమార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యకర జీవితం

అమరచింత: ప్లాస్టిక్‌ను నిత్యం వాడడం ద్వారా ప్రజలు వివిధ రకాల వ్యాధులకు గురవుతారని, వాటిని నిషేధించాలని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. వందరోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ వాడటం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.



అమరచింతలో అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

బహిరంగ సభ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య

వనపర్తిటౌన్: ఇచ్చిన మాట కాంగ్రెస్ ఎన్నటికీ తప్పదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు కొండేటి మల్లయ్య అన్నారు. ఈ మేరకు గురువారం డీసీసీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో జరిగే జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ బహిరంగ సభను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్లలో గ్రామాల్లో ఒక్క ఇళ్లు నిర్మించకుండా కాలం గడిపిందని దుయ్యబట్టారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిన్నర కాలంలోనే ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తూ పేదవారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతుందని పేర్కొన్నారు. బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు ముఖ్య నాయకులు పాల్గొంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్ధన్, నాయకులు కిరణ్‌కుమార్, సమద్ మియా, జానకీరాములు, నారాయణ, పెంటన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఖాజామైనోద్దీన్

కొత్తకోట: పట్టణంలోని 15వ వార్డులో నెలకొన్న పలు సమస్యలు పరిష్కరించాలని గురువారం మున్సిపల్ మేనేజర్ రవీందర్‌కు మాజీ కౌన్సిలర్ ఖాజామైనోద్దీన్ వినతి పత్రాన్ని అందజేశారు. వార్డులో ఉన్న మురికి కాల్వ గుంత అటుగా వెళ్లే పాదాచారులు, వాహనదారులకు ప్రమాదకరంగా ఉందని, మరమ్మతు చేయించి గుంత చుట్టు జంక్షన్ ఏర్పాటు చేయాలని కోరారు. వీధి లైట్లు లేకపోవడంతో వార్డు అంధకారంలో ఉందని వాపోయారు. ఎస్సీ కాలనీలో ముత్యాలం బావి వద్ద బోరు మోటార్ రిపేరు గురై 15 రోజులు అయ్యిందని, వెంటనే మరమ్మతు చేయించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వార్డులో పలుచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందన్నారు. జామే మసీదు కమ్యూనిటీ హాల్‌కు మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి టీయూఎఫ్ ఐడీసీ నిధుల కింద రూ.10 లక్షలు మంజూరు చేశారని, ప్రస్తుత ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి దీని నిర్మాణం కోసం శంకుస్థాపన చేసి 6 నెలలు గడుస్తున్నా నేటికీ పనులు ప్రారంభించలేదని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు రజియోద్దీన్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి



వీపనగండ్ల: అన్నదాతలు విశిష్ట ఆధార్ తరహాలో రైతు గుర్తింపు కార్డులను పొందాలంటే తమ పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని పాన్‌గల్ ఏడీఏ దాకేశ్వర్‌గౌడ్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో రైతుల ఆన్‌లైన్ నమోదు తీరును ఆయన పరిశీలించారు. విశిష్ట గుర్తింపు కార్డు పొందడం వల్ల కేంద్రప్రభుత్వ పథకాలు రైతులకు సక్రమంగా అందడమే కాకుండా సకాల వర్షాలు, ప్రకృతి విపత్తుల సమయంలో పీఎం కిసాన్, పంటల బీమా తదితర పథకాల ద్వారా రైతులకు సకాలంలోఆర్థికసాయం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ అభిలాష్, రైతులు పాల్గొన్నారు.

మాదిగలు ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలి



మాట్లాడుతున్న కొమ్ము చెన్నకేశవులు

ఖిల్లాఘనపురం: మాదిగలు సామాజికంగా, ఆర్థికంగా ఎదిగినప్పుడే అభివృద్ధి సాధ్యమని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కొమ్ము చెన్నకేశవులు, జిల్లా ఇన్‌చార్జ్ టైగర్ జంగయ్య, మహాజన సోషలిస్టు పార్టీ వనపర్తి జిల్లా కోఆర్డినేటర్ గట్టుస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గౌరిపాగ లక్ష్మయ్య ఆధ్వర్యంలో మాదిగల చైతన్య సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి వివక్షకు గురైన మాదిగలు ఎస్సీ వర్గీకరణ ద్వారా రాజ్యాంగ ఫలాలు పొందుతున్నారని చెప్పారు. రిజర్వేషన్లు అనే నాణెనికి ఒక వైపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అయితే మరో వైపు మందకృష్ణ మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ కేవలం మాదిగల కోసమే కాకుండా సమాజంలో సమస్యలతో సతమతమవుతున్న దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారుల కోసం ఎన్నో పోరాటాలు చేసి చేసిందని గుర్తు చేశారు. జులై 7న ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, గ్రామాల్లో జెండా ఆవిష్కరణ చేయాలని చాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మనిగిళ్ల యాదయ్య, రాజు, శ్యాం, పానుగంటి మల్లేష్, రాములు, తిరుపతయ్య, చెన్నయ్య, మన్నెం తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి



వీపనగండ్ల: దేశవ్యాప్తంగా ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రంలో గురువారం జిల్లా రైతు కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, వ్యతిరేక చట్టాలను ఉపసంహరించుకొని కనీస వేతన చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. సార్వత్రిక సమ్మెలో రైతులు, కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు, వ్యవసాయ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బాలగౌడ్, ఆశన్న, బాలస్వామి, ఈశ్వర్, వెంకటేశ్వర్లుగౌడ్, ప్రజా సంఘాల నాయకుడు రామస్‌గౌడ్, నవీన్, రంగస్వామిగౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

కొత్తకోట రూరల్: మాజీ ముఖ్యమంత్రి రోశయ్య జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా చేపట్టేందుకు నిర్ణయించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డికి కురుమూర్తి దేవస్థాన పాలక మండలి సభ్యులు బాదం వెంకటేశ్వర్లు ఆర్యవైశ్యుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా, తమిళనాడు రాష్ట్ర గవర్నర్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. సీఎం రేవంత్‌రెడ్డి గతంలో ప్రకటించినట్లుగా ప్రతి ఏడాది జులై 4న మాజీ సీఎం కొణిజేటి రోశయ్య జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వ ఉత్తర్వులు ఇవ్వడం హర్షించదగ్గ విషయమన్నారు.

అభివృద్ధి చూసి కాంగ్రెస్‌లో చేరికలు

గోపాల్‌పేట: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. గురువారం తెలుగుదేశం పార్టీకి చెందిన నాయకుడు రాంచంద్రయ్య ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరాడు. అనంతరం ఇటీవల గోపాల్‌పేట టౌన్ యాదవ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీశైలం ను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో సత్యశీలారెడ్డి, వెంకటేశ్, కోటిరెడ్డి, వెంకట్‌రెడ్డి, శివన్న పాల్గొన్నారు.



చినుకు పడితే చిత్తడే..



వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని బునాదిపురంలో ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి వర్షానికి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టాలని గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ నరేందర్ ఆర్అండ్‌బీ ఏఈకి ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గుంతల్లో నీరు చేరి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ఎర్రవల్లి: ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదికి వరద పోటెత్తడంతో పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ నరేష్ సూచించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో విపత్తులపై మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. అకస్మాత్తుగా సంభవించే విపత్తులతో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షాకాలం ప్రారంభమవ్వడంతో గ్రామాల్లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లను గుర్తించి కుటుంబ సభ్యులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. నదీ ప్రవాహంలోకి మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదన్నారు. గ్రామాల్లో వర్షం నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఏఓ రవికుమార్, ఎంపీడీఓ అబ్దుల్‌సయ్యద్‌ఖాన్, వైద్యాధికారి రాధిక పాల్గొన్నారు.

పేపర్ బ్యాగులనే వాడుదాం



పేపర్ బ్యాగులు తయారు చేసిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయ బృందం

పాన్‌గల్: ప్రపంచ ప్లాస్టిక్ వ్యతిరేక దినోత్సవంలో భాగంగా గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో పేపర్ బ్యాగులను తయారు చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల జీహెచ్‌ఎం విజయ్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ కవర్లను, వస్తువులను వాడకూడదని వీటి వలన వాతావరణ, నేల కాలుష్యం ఏర్పడుతుందన్నారు. పేపర్ బ్యాగులను, జ్యూట్ బ్యాగులను వాడి పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యాయులు మల్లేష్ కుమార్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు మెరుగైన వైద్యం

పాన్‌గల్: సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం లాంటిది అని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్‌సాగర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో వివిధ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆయన మండల కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎంఆర్‌ఎఫ్ ద్వారా పేదలు కార్పొరేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారన్నారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 37 మంది లబ్ధిదారులకు రూ.11.23 లక్షల విలువైన చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రవికుమార్, వెంకటేష్‌నాయుడు, రాముయాదవ్, పుల్లారావు, భాస్కర్‌యాదవ్, గోవర్ధన్‌సాగర్, బ్రహ్మయ్య, గిరినాయుడు, వాల్మీకినాయుడు, గోపాల్‌రావు, నరేందర్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముందుకు సాగని ‘బీటీ’ పనులు

- 4 కి.మీ. రహదారికి రూ.3.50 కోట్లు
- కచ్చ రహదారితో రైతుల ఇక్కట్లు
- ఆరేళ్లు గడుస్తున్నా పనులు చేపట్టని కాంట్రాక్టర్



అమరచింత నుంచి మూలమళ్ల వెళ్లే కచ్చ రహదారి

అమరచింత: ఆరేళ్ల కిందట అమరచింత నుంచి మూలమళ్ల గ్రామం వరకు ఉన్న కచ్చ రహదారికి బీటీ వేసేందుకు నిధులు మంజూరైనా ఇప్పటి వరకు పనులు మాత్రం ముందుకు సాగట్లేదు. నాలుగు కిలోమీటర్ల మేర బీటీ వేయడానికి ప్రభుత్వం రూ.3.5 కోట్లు మంజూరు చేసింది. పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇప్పటి వరకు పనులు చేపట్టక పోవడంతో ఇరు గ్రామాల ప్రజలు, రైతులు, వాహనదారులు వర్షాకాలంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అమరచింత ఎత్తిపోతల పథకంతో పాటు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన ఎడమ కాల్వ ద్వారా సాగునీరు సమృద్ధిగా లభిస్తుండటంతో ఇరు గ్రామాల రైతులు ఏడాదిలో రెండు పర్యాయాలు వరి పంటను మాత్రమే సాగు చేస్తున్నారు. పండించిన వరిధాన్యాన్ని మార్కెట్‌కు తరలించే యత్నంలో కచ్చ రహదారిపై ఉన్న గుంతల కారణంగా వర్షపునీరు నిల్వలతో ట్రాక్టర్లు, ఎద్దుల బండ్ల ద్వారా ధాన్యం తరలించేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అమరచింత పట్టణం నుంచి జూరాల ప్రాజెక్టును సందర్శించేందుకు వెళ్లే వాహనాలు, పర్యాటకులు సైతం ఇదే రహదారిపై ప్రయాణం చేస్తుంటారు. బీటీ పనులు వెంటనే చేపట్టాలని పలుమార్లు పీజేపీ అధికారులకు విన్నవించినా ఇప్పటికీ పనుల్లో కదలికలు లేకపోవడం దారుణమని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. రోడ్డు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్‌పై అధికారులు ఒత్తిడి తేకపోవడంతోనే బీటీ రహదారి పనులు ముందుకు సాగడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

కచ్చ రహదారితో ఇబ్బందులు

అమరచింత ఎత్తిపోతల ఆయకట్టు ద్వారా పంట పొలాలకు సాగునీరు పుష్కలంగా అందుతుండటంతో వరి పంట సాగుచేస్తున్నాను. పొలానికి వెళ్లడానికి కచ్చ రహదారే శరణ్యం. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ప్రతిసారి ఇబ్బందులు పడుతున్నాం. కొన్నిసార్లు గుంతలను తప్పించబోయి వాహనం అదుపు తప్పి కింద పడుతున్నాం. వర్షాకాలంలో రహదారి పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారుతుంది. అధికారులు స్పందించి బీటీ పనులు త్వరితంగా పూర్తి చేయాలి.

– కృష్ణారెడ్డి, రైతు, అమరచింత